ప్రజాశక్తి

సోమవారం 2 సెప్టెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

శాంతి ర్యాలీలో పాల్గొన్న సిహెచ్.నర్సింగరావు తదితరులు

యుద్ధం వద్దు.. శాంతి కావాలి

విశాఖలో సిఐటియు ర్యాలీ

వార్త మెయిన్‌లో..

వక్ఫ్ బోర్డు చట్ట సవరణతో

5600 ఎకరాలకు ముప్పు

విశాఖ నగరంలోని దర్గా

- విశాఖలో తహశీల్దార్ల సర్వేకు శ్రీకారం
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ కంటే ప్రమాదకరమని ముస్లిముల్లో ఆందోళన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ అంశం ఉమ్మడి విశాఖలోని ముస్లిములను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే ఉన్న చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించి, మార్పులు చేయాలనుకోవడాన్ని వారంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. భూములను కాజేసే కుట్ర దీనిలో దాగి ఉందంటూ కలవరపడుతున్నారు. వాస్తవానికి విశాఖ జిల్లాలోని పెందుర్తి సహా నగర వ్యాప్తంగా 5600 ఎకరాల వరకూ వక్ఫ్ భూములున్నాయి. ఇప్పటికే లోపాయికారిగా జిల్లాలోని తహశీల్దార్లు ఈ వక్ఫ్ ఆస్తుల వివరాలపై సర్వేకు శ్రీకారం చుట్టారు. దీంతో శతాబ్దాల నాటి ఆస్తులు అన్యాక్రాంతం అయిపోతాయన్న భయంతో ముస్లిములు బిక్కుబిక్కుమంటున్నారు.

చట్ట సవరణ ఏం చెబుతోంది ?

అమలైతే ఏం జరుగనుంది ?

దేశ వ్యాప్తంగా తాజాగా 44వ చట్ట సవరణ బిల్లును వక్ఫ్ ఆస్తులపై ప్రయోగించాలని మోడీ సర్కారు చూస్తోంది. దీని ప్రకారం వక్ఫ్ ఆస్తులపై సర్వాధికారాలను జిల్లాల కలెక్టర్లకు అప్పగించనుంది. గతంలో ఏదైనా వక్ఫ్‌కు భూమి, స్థలం సంక్రమిస్తే ఈ 44వ సవరణలోగల సెక్షన్ 3 ప్రకారం ఇకపై చెల్లదు. దీన్ని కలెక్టర్ మార్చేయవచ్చు. ఇదే జరిగితే ముస్లింలకు ఇప్పుడున్న ఆస్తులు, భవనాలు, భూములకు రెక్కలు వచ్చే ప్రమాదం లేకపోలేదు. వక్ఫ్ అంటేనే దేవునికి ఇచ్చినట్టు లెక్క. 14వ శతాబ్దంలో విశాఖలోని దర్గా (వాలీ హజ్రత ఇషాన్)కు 5600 ఎకరాలు ఇలా దఖలు కాబడ్డాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇస్లాంపేట, పెద్దపాలెం, చిన్నపాలెం, దేవాడ, ఫకీర్‌తకియా వంటి చోట్ల ఈ వక్ఫ్ భూములున్నాయి. సుమారు 9 లక్షల ముస్లిం జనాభా కమ్యూనిటీ కోసం ఉద్దేశించిన ఈ భూముల్లో 2014లో మిగతా 2లో..

ఎంపీ సిఎం రమేష్ కుట్రలను తిప్పికొట్టాలి : సిపిఎం

వార్త 8లో..

నిరంతర అప్రమత్తతతో ప్రమాదాల నియంత్రణ

వార్త 2లో..

రైళ్ల రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ డివిజన్‌లో రాయనపాడు స్టేషన్‌లో భారీ వర్షాలకు నీరు నిలిచిపోవడంతో పలు రైళ్లను రద్దు చేశామని, కొన్నింటిని దారి మళ్లించామని ఈస్ట్ కోస్ట్ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఆదివారం తెలిపారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 2న 20810 నాందేడ్ - సంబల్‌పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్, 20707 సికింద్రాబాద్ - విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్, 20708 విశాఖ పట్నం - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్, 20833 విశాఖపట్నం - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్, 20834 సికింద్రాబాద్ - విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. అదేవిధంగా సెప్టెంబర్ 3న 12703 హౌరా - సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, 18520 లోకమాన్య తిలక్ టెర్మినల్ - విశాఖపట్నం మిగతా 2లో..

నేడు విద్యా సంస్థలకు సెలవు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి : భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా సోమవారం అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించిందని విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ వేర్వేరు ప్రకటనల్లో ఆదివారం తెలిపారు. ఈ ఉత్తర్వులను అందరూ అమలు చేయాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి..

5600 ఎకరాలకు ముప్పు

చంద్రబాబు హయాంలో హిందూజా పవర్ ప్లాంట్‌కు 500 ఎకరాలు ధారాదత్తం చేశారు. ఇప్పుడు అదే చంద్రబాబు ఎన్‌డిఎ కూటమిలో ఉండటంతో వక్ఫ్ ఆస్తులపై కేంద్రం మరింత తెగబడే అవకాశముందని పలువురు అంటున్నారు.

పవన్ ఎన్నికల ముందు చేసిన వ్యాఖ్యలపై చర్చ

సార్వత్రిక ఎన్నికలకు ముందు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముస్లింలను ఆకట్టుకునే ప్రసంగాలు చేసిన విషయం తెలిసిందే. తాను బిజెపితో ఉన్నానని భయపడవద్దని, ఏ చిన్న కష్టం వచ్చినా తానే ముందు బయటకొచ్చి మాట్లాడతానని నాడు ఆయన అన్నారు. ఆ వ్యాఖ్యలపై ఇప్పుడు తీవ్ర చర్చ జరుగుతోంది. వక్ఫ్ ఆస్తులకు చట్టసవరణ ద్వారా మోడీ సర్కారు నష్టం చేకూర్చాలని చూస్తున్నా పవన్ మాట్లాడకపోవడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ కంటే ప్రమాదకరం

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ తీవ్ర ప్రమాదకరం. సవరణ బిల్లును ఎన్‌డిఎ సర్కారు పార్లమెంట్‌లో పెట్టడం, నాన్ ముస్లింలను కమిటీల్లో పెట్టడం ద్రోహం. ఎవరైనా ప్రాపర్టీని వక్ఫ్‌కు ప్రమోట్ చేస్తే గతంలో లెటర్ ద్వారా జరిగిపోయేది. తాజాగా రూల్స్‌ను రెవెన్యూ ఫ్రేమ్ చేస్తుంది. ఇది వక్ఫ్ ట్రిబ్యునల్‌ను నీరుగార్చడమే. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దుచేసిన చంద్రబాబు దీనిపై మౌనం వహిస్తున్నారు.

అబ్దుల్ అహద్ ఆషరఫ్, ఆవాజ్ విశాఖ జిల్లా కార్యదర్శి

వక్ఫ్ ఆస్తులు అమ్మడానికి లేదు

త్వరలో జిల్లా కలెక్టర్లకు వీటి నియంత్రణా అధికారాలను కేంద్రం ఇవ్వనుంది. ముస్లింల ఆస్తులు, భవనాలు, భూములను స్వాధీనం చేసుకునే హక్కులు బదలాయించే ప్రమాదం ఉంది. తమ వక్ఫ్ ఆస్తులు ఆక్రమణలకు గురౌతున్నాయంటూ ముస్లింలు నిత్యం కలెక్టరేట్ల చుట్టూ ఇప్పటికే తిరుగుతున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. తాజాగా చట్ట సవరణకు దిగడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందమే.

రెహమాన్, పెందుర్తి ఏరియా ముస్లిం నాయకుడు

బిజెపివి మాయ మాటలు

చట్ట సవరణపై బిజెపి మాయమాటలు చెబుతోంది. దేశ వ్యాప్తంగా 30 వక్ఫ్ బోర్డులు, 9 లక్షల రకరకాల ఆస్తులు వక్ఫ్‌లో ఉన్నాయి. వీటన్నిటిపై బిజెపి పెత్తనం చెలాయించాలని చూస్తోంది.

సాధిక్, జివిఎంసి కార్పొరేటర్

రైళ్ల రద్దు, దారి మళ్లింపు

ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. 12803 విశాఖపట్నం - నిజాముద్దీన్ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 2న సాధారణ మార్గం దువ్వాడ-విజయవాడ-బల్హర్షాలకి బదులుగా విజయనగరం-రాయగడ-టిట్లాగఢ్-రాయ్‌పూర్-నాగ్‌పూర్ మీదుగా మళ్లించబడిన మార్గంలో నడుస్తుంది. 18046 హైదరాబాద్- షాలిమార్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 2న సాధారణ మార్గం కాజీపేట - వరంగల్ - ఖమ్మంకు బదులు పగిడిపల్లి - నల్గొండ - గుంటూరు మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తుంది.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

ప్రయాణికుల అదనపు రద్దీని నియంత్రించే క్రమంలో పలు రైళ్లకు అదనపు కోచ్‌లను జత చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో 08522 విశాఖపట్నం-గుణుపూర్ ప్యాసింజర్ స్పెషల్, 08521 గుణుపూర్-విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 08551 విశాఖపట్నం-కిరండూల్ ప్యాసింజర్ స్పెషల్ రైళ్లకు సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు ఒక్కో స్లీపర్ క్లాస్ కోచ్ జత చేయనున్నారు. అదేవిధంగా 08552 కిరండూల్-విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్ రైలుకు సెప్టెంబర్ 2 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్ జత చేయనున్నారు.

హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు

ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని వాల్తేరు డివిజన్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రద్దయిన పలు రైళ్ల ప్రయాణికులకు టికెట్ రుసుమును తిరిగి చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అవసరమైన సమాచారం అందించేందుకు విశాఖపట్నంలో 0891-2746330, 0891-2744619, విజయనగరంలో 8712641260, 08922 221202 నెంబర్లతో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

గిగ్ వర్కర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గాజువాకలో గిగ్ వర్కర్‌పై దాడికి పాల్పడిన పోలీస్ అధికారి కుమారునిపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు బి.జగన్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బిగ్ బాస్కెట్‌లో పనిచేస్తున్న గిగ్ వర్కర్ పార్సిల్ తీసుకెళ్తుండగా వెనుక నుంచి కారుతో వచ్చి గుద్దేయడమే కాకుండా ఆ వర్కర్‌పైన దాడి చేయడం దుర్మార్గమన్నారు. పోలీస్ అధికారి కుమారుడినన్న గర్వంతో ఈ దాడికి పాల్పడ్డారని జగన్ పేర్కొన్నారు.

'ప్రజాసేవ కోసమే పార్టీ పెట్టా'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలకు మరింత సేవ చేయాలనే ఉద్దేశంతోనే 'ప్రజాసేవ' రాజకీయ పార్టీని స్థాపించానని సామాజికవేత్త డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పార్టీ వివరాలను వెల్లడించారు.

నిరంతర అప్రమత్తతతో ప్రమాదాల నియంత్రణ

◆ భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి ◆ మాక్‌డ్రిల్ తప్పనిసరి కావాలి ◆ ప్రమాదాలపై అవగాహన పెంపొందించాలి
◆ 'ప్రజాశక్తి'తో ఐఐపిఇ విశ్రాంత డైరెక్టర్ వివిఎస్ఆర్‌కె ప్రసాద్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

'పరిశ్రమలలో నియంత్రించలేని ప్రమాదాలేవీ లేవు. ప్రతి ప్రమాదానికీ నియంత్రించే మార్గం వుంది. దానికి అంకితభావం, చిత్తశుద్ధి వుండాలి. నిరంతరం పని ప్రదేశంలో అప్రమత్తత అవసరం. అందుకు నైపుణ్యం ముఖ్యం. ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పత్తి స్వభావానికి అనుగుణంగా కార్మికుల్లో నిరంతరం అవగాహన పెంపొందించాలి. మాక్‌డ్రిల్ సీరియస్‌గా నిర్వహించాలి. పరిశ్రమల తనిఖీ సిబ్బందిని పెంచాలి. కార్మికులకు తన పనిలోనూ, ప్రమాద సమయంలో అప్రమత్తతో ఎలా బయటపడాలో నేర్పించాలి. పరిశ్రమలకు అతి సమీపంలో ఆసుపత్రిని ఏర్పాటుచేయాలి' అని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వివిఎస్ఆర్‌కె.ప్రసాద్ తెలిపారు. ఫార్మా, ఇతర పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ప్రమాణాలపై 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక విషయాలను తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఫార్మా కంపెనీల్లో తరచూ ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి ?

ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు జరగడానికి సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, పరిస్థితులకు తగిన నైపుణ్యాలు పెంపొందించకపోవడం కారణాలు. తొలుత ప్రమాదాలను నియంత్రించాలన్న ఆలోచన వుండాలి. అంకితభావం అవసరం. అవగాహనలేమితో జరుగుతున్న ప్రమాదాలు అధికంగా వున్నాయి. తక్కువ జీతాలకు పనిచేసే నైపుణ్యంలేని కార్మికులతో పనిచేయించడం మంచిదికాదు.

నియంత్రణా మార్గంలేదా ?

ప్రతి ప్రమాదానికీ నియంత్రణ మార్గం వుంది. పరిశ్రమలో నియంత్రించలేని సమస్యంటూ ఏమీ లేదు. కార్మికులకు పనిపట్ల నైపుణ్యం, ప్రమాదాలపై సరిపడినంత అవగాహన కల్పించాలి. ఆ బాధ్యత యాజమాన్యానికి వుంది. ఆ అవగాహనతో పనిచేయాల్సిన బాధ్యత కార్మికునిపై వుంది. అసెన్షియా ఫార్మాలో సాల్వెంట్ లీకవుతుందన్న విషయం ప్రమాదానికి రోజున్నర ముందే తెలిసినా, సరిచేయలేదంటే ఏమనుకోవాలి. ప్రమాద తీవ్రత తెలిసి సరిచేస్తే 17 మంది ప్రాణాలు పోయేవికావు. అవగాహన, అప్రమత్తతలేకనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ఏ స్థాయిలో శిక్షణ, అవగాహన అవసరమంటారు ?

యాజమాన్యం నుంచి వివిధ స్థాయిల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల వరకు ప్రతి ఒక్కరికీ భద్రతపై అవగాహన అవసరం. తంతులా కాకుండా మాక్‌డ్రిల్ ప్రతీ పరిశ్రమలో సీరియస్‌గా నిర్వహించాలి. మాక్‌డ్రిల్ నిర్వహించిన యూనిట్లలో ప్రమాదం నుంచి తప్పించుకొనేందుకు కార్మికులు చేసిన ప్రయత్నంలో జరిగిన లోపాలను గుర్తించి వారికి అవగాహన కోసం శిక్షణ ఇవ్వాలి. మారుతున్న టెక్నాలజీ, ఉత్పత్తి స్వభావాన్ని బట్టి ప్రమాదాలు, వాటి తీవ్రత మారుతుంది. అందుకని వాటికి అనుగుణంగా శిక్షణ వుండాలి. భద్రత, ప్రమాదాలపై యూనివర్సిటీలు, విద్యా సంస్థల కాన్ఫరెన్స్‌కు హాజరవుతూవుండాలి.

షిఫ్ట్ సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

షిఫ్ట్ మార్పు సమయంలో ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతుంది. విధులు ముగించేవారికి, విధులకు హాజరయ్యే వారికి మధ్య కొంత గ్యాప్ ఉంటుంది. ఈ సమయంలో ఏవైనా మార్పులు సంభవించినప్పుడు గుర్తెరిగి సరిచేయడం ఆలస్యమవుతుంది. ఈ సమయంలో ప్రమాదాలు జరుగుతుంటాయి. హెచ్‌పిసిఎల్‌లో షిఫ్ట్ సమయంలోనే ప్రమాదం జరిగింది. ఆ సమయంలో అప్రమత్తత తగ్గడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుంది.

నిరంతర అప్రమత్తత ఎలా ?

అప్రమత్తత లేకపోతే ప్రాణాలకు నష్టం. పరిశ్రమ ఉత్పత్తిలో జరుగుతున్న మార్పులను సాధారణంగా చూడకూడదు. పరిశ్రమల్లో ఆటోమిషన్ కంట్రోల్ రూమ్‌లు వుండాలి. అందులో మార్పుల సంకేతాలను గమనించి అప్రమత్తంకావాలి. పరిశ్రమ నిర్వహణ లోపాలను గుర్తించే పరిశ్రమల తనిఖీ సిబ్బంది సంఖ్యను పెంచాలి.

రెడ్ కేటగిరీ పరిశ్రమల తనిఖీ తరచూ జరగాలి. ఏడాదికి రెండు సార్లయినా యాజమాన్యం సహా వివిధ స్థాయిల్లోని కార్మికులు, ఉద్యోగుల్లో నిర్లిప్తత పోగొట్టేలా సైకాలజిస్టుతో అవగాహన కల్పించాలి.

విద్యార్థులకు మెరుగైన వసతి, భోజనం అందించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థులకు మెరుగైన ఆహారం అందించడంతోపాటు మంచి వసతులు కల్పించాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు టి.శ్రీరామమూర్తి, జె.రవి ఆదివారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. వెయ్యి మంది నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురవడం దిగ్భ్రాంతి కలిగించిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి పరిస్థితులే ఉన్నాయని, మెనూ సక్రమంగా అమలు కావడం లేదని తెలిపారు.

మెరైన్ ఎస్‌పిగా రవి వర్మ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మెరైన్ ఎస్‌పిగా పివిఆర్ఎస్ఎస్ఎస్ఎమ్‌వి.రవి వర్మ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సిఐడి విభాగం అదనపు ఎస్‌పిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన ఉద్యోగోన్నతి పొందారు. ఆదివారం ఉదయం సిరిపురంలోని విఎంఆర్‌డిఎ కార్యాలయ ఆవరణలో రెండో అంతస్తులో ఉన్న మెరైన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. No. 493/2023 in
I.A. No. 1747/2019 in
O.S. 568/2019

Between:
Petitioners: Gunisetti Sudhalakshmi and another
Respondents: Karanam Mahalakshmi and Others

To:
R-11: Rachapalli Sai Vineela, D/o. late Govindarao, Door No. 45-57-45/3, Madeti Gardens, Akkayapalem, Visakhapatnam, Visakhapatnam District.

పై నెంబరు పిటిషన్‌లో 11వ రెస్పాండెంటుకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను సదరు పిటిషను సంగతులు తెలిసియుండి సదరు నోటీసు తీసుకొనకుండా Evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు ఇచ్చి **ది. 10-09-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై నెంబరు పిటిషను తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.**

K.SIVA RAMA KRISHNA
Advocate for Petitioners
Tadepalligudem
Tadepalligudem
Date: 29-08-2024
Cell: 9949076266

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. No. 490/2023 in
I.A. No. 1746/2019 in
O.S. 568/2019

Between:
Petitioners: Gunisetti Sudhalakshmi and another
Respondents: Karanam Mahalakshmi and Others

To:
R-11: Rachapalli Sai Vineela, D/o. late Govindarao, Door No. 45-57-45/3, Madeti Gardens, Akkayapalem, Visakhapatnam, Visakhapatnam District.

పై నెంబరు పిటిషన్‌లో 11వ రెస్పాండెంటుకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను సదరు పిటిషను సంగతులు తెలిసియుండి సదరు నోటీసు తీసుకొనకుండా Evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు ఇచ్చి **ది. 10-09-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై నెంబరు పిటిషను తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.**

K.SIVA RAMA KRISHNA
Advocate for Petitioners
Tadepalligudem
Tadepalligudem
Date: 29-08-2024
Cell: 9949076266

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. No. 487/2023 in
O.S. 568/2019

Between:
Petitioners: Gunisetti Sudhalakshmi and another
Respondents: Karanam Mahalakshmi and Others

To:
R-11: Rachapalli Sai Vineela, D/o. late Govindarao, Door No. 45-57-45/3, Madeti Gardens, Akkayapalem, Visakhapatnam, Visakhapatnam District.

పై నెంబరు పిటిషన్‌లో 11వ రెస్పాండెంటుకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను సదరు పిటిషను సంగతులు తెలిసియుండి సదరు నోటీసు తీసుకొనకుండా Evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు ఇచ్చి **ది. 10-09-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై నెంబరు పిటిషను తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.**

K.SIVA RAMA KRISHNA
Advocate for Petitioners
Tadepalligudem
Tadepalligudem
Date: 29-08-2024
Cell: 9949076266

ఎడతెరిపి లేని వర్షం..

జివిఎంసి భీమిలి జోనల్ కార్యాలయం ఎదుట ఒడ్డున ఉన్న బోట్లు

చేపల వేటకు అంతరాయం

వేట సాగక మత్స్యకారుల అవస్థలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. అనివార్యంగా సముద్రంలో చేపల వేటకు అంతరాయం కలిగింది. దీంతో చేపల వేటపై ఆధారపడ్డ మత్స్యకారులు, వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. పస్తులతో సహవాసం చేస్తున్నారు.

మండలంలోని అన్నవరం మొదలు ఇటు జివిఎంసి నాలుగో వార్డు పరిధి మంగమారిపేట వరకు సుమారు 18 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే కాలంలో వేట సాగిస్తే పునరుత్పత్తి దెబ్బ తింటుందనే ఉద్దేశంతో ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేటను కేంద్ర ప్రభుత్వం నిషేదిస్తున్న విషయం విదితమే. వేట నిషేధం, తుపాన్లు, భారీ వర్షాలు ఇలా వేటకు అననుకూల పరిస్థితులు తమను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నాయని పలువురు మత్స్యకారులు అంటున్నారు.

ఒడ్డునే బోట్లు...

గత కొద్ది రోజులుగా విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తెప్పలు, ఇంజను బోట్లు ఒడ్డునే లంగరు వేసి ఉన్నాయి. ఎటూ వేట లేనందున వలలకు మరమ్మతులు చేసుకునే పనిలో పలువురు మత్స్యకారులు నిమగ్నమయ్యారు.

వేట లేక ఇబ్బందులు

వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సముద్రంలోకి వేటకు వెళ్లడం లేదు. వేట లేదు, పాటు లేదు, పస్తులతో ఉంటున్నాం. కొత్త ప్రభుత్వం ఇస్తామన్న వేట నిషేధ భృతి రూ.20 వేలు ఇప్పటికీ అందివ్వలేదు.

వాడమదుల హరి
మత్స్యకారుడు, బోయి వీధి,
జివిఎంసి మూడో వార్డు

తరచూ తుపాన్లు

వాయుగుండం తమ జీవనానికి ఓ “గండం”. తరచూ తుపాన్లు, భారీ వర్షాలు, వేట విరామ సమయం ఇలా అన్నీ కలిపితే ఏడాదిలో సుమారు 4 నుంచి 5 నెలలు వేట ఉండదు. తాత ముత్తాతల నుంచి చేపల వేట తప్పితే ఇతర ఏ వృత్తీ చేత కాదు.

కదిరి సింహాచలం
బోయివీధి
జివిఎంసి మూడో వార్డు

త్రిశక్తి దేవాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ కొమ్మాది జంక్షన్‌లోని బంగారమ్మ, ఎర్నమ్మ, దండుమారమ్మ అమ్మవార్లతో కూడిన త్రిశక్తి దేవాలయం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నిత్య అర్చనలతో ప్రారంభమై ముగ్గురు అమ్మవార్లకు పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరిపించారు. అలంకరణ చేసిన అనంతరం కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహించి కర్పూర నీరాజనాలను ఆలయ అర్చకులు నిష్టల రాంబాబు శర్మ తదితరులు సమర్పించారు. ప్రసాదం అమ్మవార్లకు నివేదించిన అనంతరం భక్తులు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, సెక్రటరీ మొల్లి లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు పిళ్లా పాపారావు, కోశాధికారి వాండ్రాసి అప్పలరాజు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : సిహెచ్‌సిలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యాన ఆదివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన తెలిపారు. నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, మహిళా కార్మికులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొండపు ఈశ్వరరావు, కె.రాంబాబు, ఎం.అప్పలరాజు, ఎం.వీర్రాజు, పలువురు కార్మికులు పాల్గొన్నారు

వెంకటాపురంలో కృష్ణాష్టమి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, ఎంపిటిసి సభ్యులు ఎస్.సూరప్పడు. సర్పంచ్ కె.రమణ, నాయకులు గంగరాజు, వెంకట్రావు, మద్ది ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ, ఎ.బంగారు బాబు, వెంకటాపురం యువత పాల్గొన్నారు.

ప్రారంభానికి అన్న క్యాంటీన్ ఎదురుచూపు

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీన పలు జిల్లాల్లో ప్రారంభమైన అన్నా క్యాంటీన్లు ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా ప్రారంభానికి నోచుకోలేదు. జివిఎంసి 5వ వార్డు పరిధి మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీ, 7వ వార్డు పరిధిలోని వాంబే కాలనీ సమీపంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లు ప్రారంభం కాలేదు.

వైసిపి పాలనలో మూతపడి అసాంఘిక కార్య కలాపాలకు నిలయంగా మారిన ఈ భవనాన్ని జివిఎంసి యంత్రాంగం ఇటీవల ఆధునీకరించి ప్రారంభించేందుకు సిద్ధం చేసింది. ఇక్కడి అన్న క్యాంటీన్ ప్రారంభిస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు, కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్సీ కోడ్ ముగిసినందున కూటమి పాలకులు అన్నా క్యాంటీన్లను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

నరవ రహదారి జలమయం

నరవ రహదారిలో నిలిచిపోయిన నీరు

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం నుంచి కొత్తపాలెం మీదుగా నరవ వెళ్లే ప్రధాన రహదారి జలమయంగా మారింది. ఇక్కడ కాలువలు, గెడ్డలు ఆక్రమణలకు గురికావడంతో తరచూ ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోతుంది. దీనిపై జివింఎసి రెవెన్యూ అధికారులు వచ్చి చూడడమే తప్ప శాశ్వత పరిష్కారం చూపించడం లేదు. వేలాదిమంది ప్రజలు ఈ రహదారి మీదుగా ప్రయాణం చేస్తూ ఉన్నారు. రహదారి మొత్తం జలమయం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఇటీవలే జివిఎంసి కమిషనర్, స్థానిక ఎమ్మెల్యే గణబాబు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఇక్కడ రహదారిపై నీరు నిలబడడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అయితే ఈ ప్రాంతంలో కొంత బంజర భూమి, కొంత రెవెన్యూ, కొంత దేవస్థానానికి సంబంధించిన భూమి ఉంది. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వ్యాపార స్వార్థం కోసం కాలువలను, గెడ్డలను ఆక్రమించి నిర్మాణాలు జరుపుతున్నారు. వీరిని ప్రశ్నించే నాధుడే లేక వీరు ఆడిందే ఆట పాడిందే పాట చందాన సాగుతోంది. ఇక్కడ రెవెన్యూ, జివిఎంసి, దేవస్థానం వారికి సరైన రికార్డులు లేకపోవడం కూడా ఒక సమస్యగా మారింది. ఒక డిపార్ట్‌మెంట్ వారు వస్తే మరో విభాగం వారు రాకపోవడం కూడా ఇక్కడ సమస్య పరిష్కారం కాకపోవడానికి ఒక కారణంగా కనిపిస్తోంది. స్థానిక వైసిపి నాయకుడు గతంలో గెడ్డపారే స్థలాన్ని కొంత భాగాన్ని ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించాడు. దీనికి జివిఎంసి, రెవెన్యూ పర్మిషన్ ఎలా ఇచ్చిందో వారికే తెలియాలని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. వైసిపి నాయకుడు నిర్మాణం వల్ల ఇక్కడ రహదారిపై నీరు నిలవడం ప్రారంభమైందని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఎప్పుడు ఇక్కడ ఈ మాదిరిగా నీరు నిలిచేది కాదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన ఈ రహదారి సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరుతున్నారు

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సీతమ్మధార : డైమండ్ పార్క్ సమీపంలో శనివారం రాత్రి రోడ్డు దాటుతున్న సమయంలో విద్యుదాఘాతానికి గురైన ఎస్.కోటకు చెందిన కల్యాణ్ (59) మృతిచెందాడు. ఎస్.కోట నుంచి ఉపాధి కోసం విశాఖ వచ్చి డైమండ్ పార్క్ ప్రాంతంలో ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి పార్కు సమీపంలో రోడ్డు దాటుతున్న సమయంలో అక్కడ వైరుపడి ఉండడాన్ని గమనించి, దాన్ని పక్కకు పెట్టేందకు పట్టుకున్నాడు. విద్యుత్ సరఫరా ఉండటంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కెజిహెచ్‌కు తరలించినప్పటికీ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతనికి కుమార్తె, కుమారుడు ఉన్నారు కుమారుడు ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణబాబును కలిసిన పాలిమర్స్ కార్మికులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఎల్‌జి పాలిమర్స్‌లో స్టైరిన్ గ్యాస్ లీకేజీ అనంతరం కంపెనీ మూతపడటంతో రోడ్డున పడ్డ 375 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఆదివారం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబును కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన అందర్నీ కలిచి వేసిందన్నారు. మీకు జరిగిన నష్టాన్ని, కోల్పోయిన ఉద్యోగ అవకాశాలను కంపెనీ యాజమాన్యంతో, ఉన్నత అధికారులతో మాట్లాడి తగున్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం ల్యాండ్ లూజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

సిగ్నల్ పాయింట్ల వద్ద ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : శ్రీనగర్, అగనంపూడి జంక్షన్ వద్ద ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుచేయాలని స్థానికుల నుంచి డిమాండ్ ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. జివిఎంసి గతంలో ప్రతిపాదించిన సర్వీస్ రోడ్డు అయినా వినియోగంలోకి వస్తే కొంతవరకు వడ్లపూడి మాదిరిగా ట్రాఫిక్ సమస్య తీరుతుందని ఎదురుచూస్తున్నారు. సర్వీసు రోడ్డు ఇప్పట్లో అమలయ్యేటట్టు కనిపించకపోవడంతో శ్రీనగర్ ఊర్లో నుంచి జంక్షన్‌కు వచ్చే రహదారినైనా కనీసం ఫ్రీ లెఫ్ట్ చేస్తే కొంతవరకు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అవకాశం ఉంది. మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో గంటలపాటు వాహనాలు రోడ్లపై ఉంటున్నాయి.

అగనంపూడిలో కూడా ఫార్మాసిటీ బస్సులు పెరగడం, అగనంపూడి కొత్తగా జనరల్ హాస్పిటల్ వెళ్లే దారిలో 100 వరకు అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం కావడంతో ప్రజలు, వాహనదారులు పెరిగారు. అగనంపూడిలో కూడా ఫ్రీ లెఫ్ట్ డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. గాజువాక నుంచి అనకాపల్లి వెళ్లే వాహనాలు అగనంపూడి దగ్గర ఈ సిగ్నల్ దాటాలంటే కనీసం అరగంట సమయం పడుతుంది. దీంతో సమయం చాలా వృథా అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

యాదవ సంఘం కమిటీ ఏర్పాటుపై చర్చ

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలో 7 వార్డులకు సంబంధించి యాదవ సంఘాలు ఆదివారం గాజువాక డిపో వద్ద ఉన్న యాదవ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఏడువార్డులకు సంబంధించి సంఘ సభ్యులందరూ సమీక్షలుజరపాలని, సమస్యలపై వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. కమిటీని నిర్ణయించి రిజిస్ట్రేషన్ చేయించిన తర్వాత కమిటీ ద్వారా కార్యక్రమాల జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంతం యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వర్షాలకు గోతులు..

ప్రజాశక్తి -గాజువాక : మూడు రోజులుగా గాజువాకలో కురిసిన వర్షాలకు పలు రహదారులు గోతులమయమయ్యాయి. అందులో ప్రధానంగా పాత గాజువాక, చినగంట్యాడ, వంటిల్లు జంక్షన్ రోడ్లు గోతులుమయం కావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో లైట్లు వెలగకపోవడంతో, గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఎక్కువగా వంటిల్లు జంక్షన్ వద్ద ఈ ప్రమాదాల జరగడంతో, తాత్కాలికంగా గోతుల వద్ద చెట్లు కొమ్మలు వేశారు. అయినా సరే ప్రమాదాలు జరుగుతున్నాయి. తక్షణ మరమ్మతుల కింద జివిఎంసి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృధ్వీతేజ్

ప్రజాశక్తిసీతమ్మధార : వర్షాల ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృధ్వీతేజ్ ఇమ్మడి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధనశాఖ కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాలమేరకు ఎప్పటికప్పుడు అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు, సెల్ టవర్లకు, అత్యవసర సర్వీసులు అందించే ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. ఈ చర్యల్లో భాగంగా అన్ని సెక్షన్ కార్యాలయాలకు జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, పవర్ సాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రి,

సిబ్బందిని అందుబాటులో ఉంచడం ద్వారా పునరుద్ధరణ చర్యలను త్వరితగతిన చేపట్టగలిగామన్నారు. వర్షాల కారణంగా ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలోని 9 మండలాలు, 60 గ్రామాల్లో 3,299 సర్వీసు కనెక్షన్లకు, 56 వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్తు అంతరాయం ఏర్పడగా యుద్ధప్రాతిపదికన సరిచేసినట్లు పేర్కొన్నారు.

వినియోగదారుల నుంచి టోల్ ఫ్రీ నెంబరు 1912కు, కంట్రోల్ రూమ్ నెంబర్లకు వచ్చిన 2583 ఫిర్యాదులను కాల్ సెంటర్ సిబ్బంది ఎప్పటికప్పుడు నమోదు చేసుకుని వాటిని క్షేత్రస్థాయి సిబ్బందికి త్వరితగతిన తెలియజేయటం ద్వారా కేవలం ఒక్క రోజులోనే 2175 ఫిర్యాదులను పరిష్కారించగలిగామన్నారు. విద్యుత్తు అంతరాయాలకు సంబందించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1912కు, కంట్రోలు రూమ్ ఫోన్ నెంబర్లు - కార్పోరేట్ ఆఫీసు 9440816373, శ్రీకాకుళం 9490612633, పలాస 7382585630, టెక్కలి 7095875259, విజయనగరం 9490610102, విశాఖపట్నం 7382299975, రాజమండ్రి 7382299960, ఏలూరు 9440902926, సంబంధిత సెక్షన్ కార్యాలయాలకు తెలియచేసి పరిష్కారం పొందవచ్చని సిఎమ్‌డి తెలిపారు.

బంగారు పతకం, ధ్రువపత్రం అందుకుంటున్న ఎఎంసి రేడియాలజీ విద్యార్థిని పుష్పిత

ఎఎంసి రేడియాలజీ విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర మెడికల్ కాలేజీ రేడియాలజీ విభాగం విద్యార్థిని డాక్టర్ పుష్పిత బంగారు పతకం, ధ్రువపత్రం అందుకున్నారు. ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ రాష్ట్ర 10వ వార్షికోత్సవ సమావేశం నెల్లూరులో మూడు రోజులు పాటు నిర్వహించారు. వార్షికోత్సవ సందర్భంగా రేడియాలజీ విభాగంలో వైద్యరంగంలో పేపర్ ప్రజెంటేషన్ పోటీలలో పుష్పిత అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం కెజిహెచ్ రేడియాలజీ విభాగం హెచ్ఒడి డాక్టర్ బుచ్చిబాబు అభినందనలు తెలియజేస్తూ రేడియాలజీ విద్యార్థులు చదువుతోపాటుగా పరిశోధనలు, నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ సురేంద్ర, నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా ఎన్నికైన డాక్టర్ సురేష్, వైజాగ్ రేడియాలజీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కెఆర్.వర్మ తదితరులు పాల్గొన్నారు

రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ బైక్ ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : దొండపర్తిలోని రాయల్ ఎన్ఫీల్డ్ షోరూమ్‌లో రాయల్ ఎన్ఫీల్డ్ క్లాసిక్ 350 న్యూ బైక్‌ను సంస్థ ఎమ్‌డి సీతారాం చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్లాసిక్ 350 న్యూ బైక్‌ను నూతన టెక్నాలజీతో ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. ట్యాంక్ కెపాసిటీ 13 లీటర్లు, వేగం 470 నుంచి 500 కిలోమీటర్ల వరకు స్పీడు ఉంటుందని పేర్కొన్నారు. రాయల్ ఎన్ఫీల్డ్ మొత్తం ఏడు రంగులతో వాహనాలను ఆవిష్కరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాయల్ ఎన్ఫీల్డ్ రీజినల్ బ్రాంచ్ మేనేజర్ సోమశేఖర్, సేల్స్ మేనేజర్ కల్యాణ్, ఆర్ఎం రాజేంద్రప్రసాద్, షోరూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయల్ ఎన్ఫీల్డ్ క్లాసిక్ 350 న్యూబైక్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ ఎమ్‌డి సీతారాం చౌదరి

పెయింటింగ్ పోటీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : స్థానిక బుల్లయ్య కళాశాలలో వాతావరణం మార్పు అంశంపై స్టూడెంట్ సొసైటీ ఫర్ క్లైమేట్ చేంజ్ ఎన్జీవో సంస్థ, సీడ్స్ అఫ్ పీస్ సంస్థతో కలిసి రెండు రోజులపాటు ఆర్ట్ ఎగ్జిబిషన్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. కళాశాలకు చెందిన 70 మంది గ్రీన్ క్లబ్ విద్యార్థులు మూడు బృందాలుగా ఉత్సాహంగా పాల్గొన్నారు. క్లైమేట్ చేంజ్‌పై విద్యార్థులు గీసిన పెయింటింగ్‌లు, ఆర్ట్ ఎగ్జిబిషన్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిఎస్‌కె.చక్రవర్తి, సురేఖ, బి.మాధవి, బి.శైలజ, బి.కిరణ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడుతున్న తహాశీల్దార్ రమేష్

అపార్ట్‌మెంట్ల నీటిలో పెట్రోల్, డీజిల్ వాసన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి అక్కయ్యపాలెం సంగం ఆఫీస్ కూడలిలో ఉన్న బిపిసిఎల్ పెట్రోల్ బంక్ చుట్టూ ఉన్న అపార్ట్‌మెంట్లలోని బోరు నీరు పెట్రోల్, డీజిల్ వాసన వస్తోందని సుగుణ అభిరామ్ అపార్ట్‌మెంట్ వాసులు సీతమ్మధార తహశీల్దార్ ఎం.రమేష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహశీల్దార్ ఎం.రమేష్ ఆధ్వర్యాన వివిధ విభాగాల అధికారులు సర్వే చేపట్టారు. సివిల్ సప్లై, బిపిసిఎల్ ఆయిల్ కంపెనీ, గ్రౌండ్ వాటర్ విభాగం, పొల్యూషన్ బోర్డు, జివిఎంసి వాటర్ సప్లై, హెల్త్, శానిటేషన్ విభాగం అధికారులు పెట్రోల్ బంకును పరిశీలించారు. పెట్రోల్ బంకు చుట్టూ ఉన్న బాధిత అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎనిమిది నెలలుగా పెట్రోల్, డీజిల్ వాసనతో నీరు వస్తోందని, వాడటానికి పనికిరాకుండా పోతుందని వివరించారు. డబ్బులు వెచ్చించి ట్యాంకర్లతో నీరు తెప్పించుకున్నట్లు అపార్ట్‌మెంట్ వాసులు అధికారులకు తెలిపారు. నీటి శాంపిల్స్‌ను పరీక్షకు పంపగా పెట్రోల్, డీజిల్ కలిసినట్లు రిపోర్టు వచ్చిందని, తమ ఇళ్ల నీటి ఎందుకు కలుస్తుందో నిర్ధారించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అపార్ట్‌మెంట్ వాసుల ఇబ్బందులను అధికారులు రాతపూర్వకంగా తీసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రమేష్ మాట్లాడుతూ, పెట్రోల్ బంక్ పరిసరాల్లో 200 మీటర్లు వరకు ఉన్న నీటిలో పెట్రోల్, డీజిల్ వాసన వస్తున్నట్లు గుర్తించామన్నారు దీనిపై జియాలజికల్ సర్వే చేయాల్సి ఉందని తెలిపారు. తమ బృందం చేపట్టిన విచారణ కమిటీ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని ఆయన తెలిపారు.

సింహాచలం మాస్టారు ఆదర్శనీయులు

ఉద్యోగ విరమణ సభలో వక్తలు
సభకు హాజరైన ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -తగరపువలస : 39 ఏళ్ల ఉపాధ్యాయ ఉద్యోగ ప్రస్థానంలో ఎంతో ఆదర్శనీయంగా ఉంటూ అన్ని తరగతుల అభిమానాన్ని చెట్టి సింహాచలం మాస్టారు చూరగొన్నారని పలువురు వక్తలు కొనియాడారు. గ్రేడ్-2 గెజిటెడ్ హెడ్ మాస్టర్‌గా ఉద్యోగ విరమణ పొందిన సింహాచలం మాస్టారు, ఆమె సతీమణి ముత్యాలమ్మ (లత)ను ఆదివారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో పాటు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కె.విజయభాస్కర్, ఎంఇఒలు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఎంతో మంది స్నేహితులు, మరెందరో శ్రేయోభిలాషులు ఘనంగా సత్కరించి, సన్మాన పత్రాలు, పుష్ప గుచ్ఛాలు అందజేసి సింహా చలం మాస్టారు పట్ల వారికి ఉన్న అపారమైన అభిమానాన్ని చాటుకున్నారు. కుమారులు దుర్గ శంకర్ వర ప్రసాద్, అశోక్ చక్రవర్తి, కుమార్తె ప్రియాంక సభా నిర్వహకులుగా వ్యవహరించి ముఖ్య అతిథులకు, అతిథులకు సాదర స్వాగతం పలికారు. అమ్మఒడి నుంచి అడుగుపెట్టిన చిన్నారికి ఈ ప్రపంచాన్ని పరిచయం చేస్తూ, అక్షరాలు దిద్దడం మొదలుకొని మంచి చెడులను, కష్ట నష్టాలను అధిగమించడం నేర్పిస్తూ ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దుతున్న "గురువుల గురుతర బాధ్యత"ను అక్షరాల నెరవేర్చిన ఎందరో ఉపాధ్యాయుల సరసన చేరిన వారిలో సింహాచలం మాస్టారు ముందు వరుసలో ఉంటారని పలువురు ఉద్ఘాటించారు.

అధికారులు స్థాయిని మరిచి పనిచేయాలి

ప్రజాశక్తి -పద్మనాభం : ఉద్యోగులు తన అధికార స్థాయిని మర్చిపోయి పనిచేయాలని విద్యాశాఖ ఆర్‌జెడి విజయభాస్కర్ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు వెదుళ్ళవలస చిరంజీవిరావు ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. ఆర్‌జెడి విజయభాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదన్నారు. ఈ వృత్తిలో భావిభారత పౌరులను సన్మార్గంలో నడిపించే అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం చిరంజీవిరావు దంపతులను ఆయన సన్మానించారు. ఎంపిపి రాంబాబు, జడ్‌పిటిసి ఎస్.గిరిబాబు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తోటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ, చిరంజీవిరావు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆర్‌జెడిని స్థానిక ఎంపిపి రాంబాబు, జడ్‌పిటిసి గిరిబాబు, మండల వైసిపి అధ్యక్షులు కోరాడ లక్ష్మణ సన్మానించారు.

చిరంజీవిరావు దంపతులను సన్మానిస్తున్న ఆర్‌కెజి విజయభాస్కర్

నెట్టి నారాయణరావు ఉద్యోగ విరమణ

పద్మనాభం : మండలంలోని చిన్నాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న నెట్టి నారాయణరావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని విజయానందపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నాపురం సర్పంచ్ ఈగల అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, నెట్టు వారు, పొట్టు వారు బహుగట్టి వారు అంటూ ప్రసంగం ప్రారంభించి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం నారాయణరావు దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఈగల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నెట్టి నారాయణరావు విరమణ సభలో మాట్లాడుతున్న ఈగల శ్రీరామమూర్తి

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి

మాట్లాడుతున్న వరలక్ష్మి

● ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ ఆరు నెలల బకాయి జీతాలు వెంటనే విడుదల చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గూడూరు వరలక్ష్మి, సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు కోరారు. అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఏపీ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా మొదటి మహాసభలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలల ను అద్దంలా తీర్చిదిద్దుతున్న శానిటేషన్ వర్కర్స్‌కు ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో వారి కుటుంబాలన్నీ అర్ధాకలితో జీవిస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే ఆరు నెల జీతాలు విడుదల చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రస్తుతమిస్తున్న అరకొర జీతాలు కుటుంబాలకు పోషించుకోలేని పరిస్థితుల్లో ఉన్నవీరిక కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హై స్కూల్ స్థాయిలో పనిచేస్తున్న వారికి తీవ్ర పని ఒత్తిడి ఉందని, పిల్లల సంఖ్యకు అనుగుణంగా శానిటేషన్ వర్కర్స్ పెంచాలని, శానిటేషన్ పరికరాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, వెంటనే జోక్యం చేసుకొని జీతాలు అందించాలని కోరారు. వారం రోజుల్లో స్పందన లేకుంటే, ఈనెల 9న కలెక్టరేట్‌లో సామూహిక వినతిపత్రాలను అందజేస్తామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఆంధ్రప్రదేశ్ స్కూల్స్ కళాశాలల అనకాపల్లి జిల్లా శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగింది.నూతన జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఎం శ్రీదేవి, అధ్యక్ష కార్యదర్శులుగా కరణం శివలక్ష్మి, పిల్లి జానకి, కోశాధికారిగా బి శకుంతల, ఉపాధ్యక్షులుగా మేరపు లక్ష్మి, నిమ్మకాయల నూకరత్నం, పూడి వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శి లుగా దేవి, నూకరత్నం, గౌరీ పార్వతి, దేవి, టి వరలక్ష్మి తోపాటు మరో 15 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నూతన అధ్యక్ష కార్యదర్శులు శివలక్ష్మి, జానకి

'జాగృతి'కి జాతీయ అవార్డు

అవార్డు స్వీకరిస్తున్న జాగృతి సంస్థ సిఇఒ మౌక్తిక

ప్రజాశక్తి- సబ్బవరం.: మండలంలోని జాగృతి అమృత ఫల రైతు ఉత్పత్తిదారుల సంఘానికి ఉత్తమ రైతు ఉత్పత్తిదారుల సంఘంగా జాతీయ అవార్డు లభించినట్లుగా జాగృతి సంస్థ ఎండి కందర్ప సుజాత తెలిపారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్మెంట్ 49వ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రైతు ఉత్పత్తిదారుల కంపెనీలను పరిశీలించి, తమ సంస్థ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి జాతీయ అవార్డు ప్రకటించినట్లు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో డాక్టర్ ఎంఎస్. స్వామినాధన్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యూఢిల్లీ ఐ-కార్ డిజి డాక్టర్ ఆర్‌సి అగర్వాల్ నుంచి తమ సంస్థ సిఇఒ కెవిఎన్ మౌక్తిక అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా రైతు ఉత్పత్తి దారుల కంపెనీ చైర్మన్ పొట్నూరి అప్పారావును, పాలకవర్గ సభ్యులను, సిబ్బందిని అభినందించారు.

గ్రీన్ క్లబ్ సేవలు ప్రశంసనీయం



మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి- అనకాపల్లి : పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ క్లబ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రీన్ గణేష్ క్యాంపెయిన్ భాగంగా ఆదివారం 3500 మట్టి గణపతి విగ్రహాలను, వ్రత కథ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్, టిడిపి పట్టణ అధ్యక్షులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు డి పరమేశ్వరరావు, ప్రముఖ వ్యాపారవేత్త క్రీ సన్యాసినాయుడు, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, అన్నమయ్య వాగ్గేయ వరధాయని వ్యవస్థాపకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి హేయం

సిఐటియు ఆధ్వర్యంలో అనకాపల్లిలో నిర్వహిస్తున్న శాంతిర్యాలీ

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రపంచ కార్మిక సమాఖ్య ఇచ్చిన పిలుపులో భాగంగా అనకాపల్లి సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్, బైపాస్ రోడ్డు వద్ద శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై ఏకపక్షంగా యుద్ధానికి దిగిన ఇజ్రాయిల్ దాడిలో ఇంతవరకూ 45 వేల మంది పౌరులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో 25 వేల మందికి పైగా చిన్నపిల్లలు ఉన్నారని, స్వతంత్ర పాలస్తీనా దేశాన్ని లేకుండా చేయాలనే దురుద్దేశంతో ఇజ్రాయిల్ దురాక్రమణకు పాల్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయేల్‌కు మద్దతుగా అమెరికా ఉందన్నారు. ఆయుధ సంపత్తిని అమ్ముకోవడానికి అమెరికా చేస్తున్న కుట్రలతో ప్రపంచంలో అశాంతి నెలకొంటోందన్నారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో ఉక్రెయిన్ పక్షాన నిలబడిన అమెరికా వైఖరి వలన ప్రచ్ఛన్న యుద్ధానికి దారితీస్తుందన్నారు. ఐక్యరాజ్యసమితి చొరవ తీసుకుని యుద్ధాలు లేకుండా శాంతియుత పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఆసుపత్రులు, స్కూల్స్ పై ఇజ్రాయిల్ బాంబులు దాడి కురిపిస్తుందని, తక్షణమే యుద్ధాన్ని ఆపాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పరమేశ్వరరావు, మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి, శ్రీదేవి, శివాజీ,రమణ, మందా రాము, చలపతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పతకాలు సాధించిన ఉషా క్రీడాకారులతో సురేంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయ ఉషు ఛాంపియన్‌షిప్ 2024 పోటీలకు అనకాపల్లి క్రీడాకారులు ఎంపిక కావడం గర్వంగా ఉందని అనకాపల్లి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మళ్ల సురేంద్ర అన్నారు. గత నెల 29,30, తేదీలలో రాజమండ్రి ఈస్ట్ గోదావరి ఫారెస్ట్ కన్వర్షర్ ఫంక్షన్ హాల్లో జరిగిన 9వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్, సబ్ జూనియర్ ఉషు ఛాంపియన్షిప్ పోటీలలో అనకాపల్లి జిల్లా మారేడుపూడి ఫిట్నెస్, బాక్సింగ్ క్లబ్ సభ్యులు దువ్వాడ అరుణ, ఈగల లక్షిత్, నార్ పిన్ని తులసి రామ్,గోల్డ్ మెడల్స్ సాధించడం గర్వకారణం అన్నారు. వీరు వచ్చే నెలలో ఉత్తరాఖండ్లో జరిగే నేషనల్స్ పోటీలకు ఎంపికయ్యారు. బలిజ దుర్గాప్రసాద్, రాపర్తి గోవర్దన్, సాలపు జగదీష్,సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరందరినీ అనకాపల్లి జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షులు మళ్ల సురేంద్ర నివాసంలో అభినందించారు. కోచ్‌లు దువ్వాడ హరీష్,ఆర్. వెంకటేష్, మోహన్ ముత్యాలరావు పాల్గొన్నారు.

ఘనంగా గండి బాబ్జి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- పరవాడ: పరవాడ మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, విశాఖపట్నం జిల్లా టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి జన్మదిన వేడుకలు పరవాడలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గండి వంశీ దిలీప్, పైల జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, కన్నూరు వెంకటరమణ, సిరిపురం అప్పలనాయుడు, చింతకాయల ముత్యాలు, చేపల మసేను, వియ్యపు చిన్న, రెడ్డి శ్రీనివాసరావు పైలా రామారావు, పైలా రామచంద్రరావు పాల్గొన్నారు.

సబ్బవరం : టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి జన్మదిన వేడుకలు ఆయన స్వగ్రామం మొగలిపురంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గండి బాబ్జి యువసేన ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని యువనేత గండి బాబ్జి తనయుడు గండి వంశీదీప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గండి బాబ్జి సేవలను కొనియాడారు. అలాగే జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను జివిఎంసిలో టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, గండి వంశీ దీప్ ప్రారంభించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమం కార్యక్రమాలు నిర్వహించారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న కూటమి నేతలు, బాబ్జి తనయుడు వంశీదీప్

అలాగే సబ్బవరం మేజర్ పంచాయితీ లో సూర్య మెడికల్స్ అధినేత బాదిరెడ్డి లక్ష్మణ ఆర్థిక సహాయంతో రూ. 50 వేలతో జనరేషన్ స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన అనాధలకు రగ్గులు, దుస్తులు, బిస్కెట్లు,పళ్లరసాలు గండి వంశీదీప్ పంపిణీ చేశారు. కార్యక్రమం లో నియోజకవర్గ టీడీపీ నేతలు రెడ్డి నారాయణరావు పైల జగన్నాథ రావు, గండి దేముడు, మొల్లి ముత్యాల నాయుడు, బర్నికాన సాయినాథరావు, మాసవరపు అప్పలనాయుడు, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, తమరాన బంగారు నాయుడు, గొర్లె కృష్ణ చైతన్య, దాడి కన్నం నాయుడు, ఆడారి నాగరాజు, బర్ల రమణ పలువురు సర్పంచులు ఎంపిటీసీ లు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలమరశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ముందుగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.ప్రణవ్ గోపాల్, కార్పొరేటర్ గొలగాని వీరారావు, వలిశెట్టి తాతాజీ, బత్తి రాజశేఖర్, జప్పురుల్లా, మధు, వానపల్లి గాయత్రి ఫణి కుమారి, కేదారి లక్ష్మి పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్రంలో కౌలు రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం రైతు స్వరాజ్య వేదిక ఆంధ్ర తెలంగాణ సమన్వయకర్త కిరణ్ కుమార్ విస్సా, తెలంగాణ రైతు స్వరాజ్ వేదిక కార్యదర్శి కొండల రెడ్డి, ఆంధ్ర రాష్ట్ర కోకన్వీనర్ బాలు గాడి తదితరులు మంత్రిని కలిసి సమస్యలను విన్నవించగా, ఆయన సానుకూలంగా స్పందించారు. .2011 కౌలు రైతు చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులందరికీ వర్తింపజేయాలని, తుఫానులో నష్టపోయిన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఉన్నా లేకున్నా నష్ట పరిహారం అందజేయాలని కోరారు.

మంత్రి నాదెండ్లకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో విస్తారంగా భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రతి సోమవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం) కార్యక్రమాన్ని ఈనెల 2న సోమవారం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. ఈనెల 9న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహిస్తామన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ఈ ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని ముందు జాగ్రత్త చర్యగా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అచ్యుతాపురం సిఐ బదిలీ

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురం సిఐగా పనిచేసిన ఎం బుచ్చిరాజుకు విశాఖకు బదిలీ అయింది. అతను స్థానంలో నమ్మి గణేష్ కొత్తగా నియమితులయ్యారు ఈ మేరకు ఉత్తర్వులు విడుదలయ్యాయి.

సిఐగా మల్లికార్జునరావు

ప్రజాశక్తి- పరవాద: పరవాడ పోలీస్ స్టేషన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా మల్లికార్జునరావు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం విఆర్ నుండి పరవాడ పోలీస్ స్టేషన్‌కు బదిలీగా వచ్చారు. ఇప్పటివరకు పరవాడ సిఐగా పనిచేసిన బాల సూర్యారావును అనకాపల్లికి బదిలీ చేశారు.

4న మట్టి విగ్రహాల పంపిణీ

ప్రజాశక్తి- అచ్యుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, సుందరపు వెంకట సతీష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మునగపాక అచ్యుతాపురం రాంబిల్లి ఎలమంచిలి మండల కేంద్రాలలో ఈనెల 4న పదివేల మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులనే ప్రతిఒక్కరూ పూజించాలని లక్ష్యంగా వీటిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్థానికులు వచ్చి మట్టి విగ్రహాలను తీసుకువెళ్లాలని సూచించారు.. మండల స్థాయి కూటమి పార్టీల ప్రతినిధులు మట్టి విగ్రహాల పంపిణీ చేస్తారన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం చిత్రకళా నిలయం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రేమ సమాజంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు సుమారు 100 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్రకళ నిలయం నిర్వాహకులు బి సూర్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 17న జరుగు విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గెలుపొందిన వారికి అదే రోజు బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి -అచ్యుతాపురం : స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని గ్రంథలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు స్వచ్ఛందంగా గ్రంథాలయానికి వచ్చి పలు పుస్తకాలను చదివారు. గ్రంథాలయాలు మాకు చాలా ఉపయోగపడుతున్నాయని విద్యార్థులు అభిప్రాయం తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ర్యాలీ

ప్రజాశక్తి-సబ్బవరం : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్, సేల్స్ మెన్, వాచ్‌మెన్ పోస్టులను కొనసాగించాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండలంలోని వైన్‌షాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త మద్యం విధానంలో ప్రభుత్వ వైన్‌షాప్‌లను ప్రైవేట్ వ్యక్తులకు టెండర్ విధానంలో అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని వాపోయారు. అలాగయితే వైన్ షాప్‌ల సిబ్బంది జీవనోపాధి కోల్పోయి, రోడ్డున పడక తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సబ్బవరం నుండి జెర్రిపోతుల పాలెం డిపో వరకు శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో యర్ర సోంబాబు పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాల్సిందే..

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు అనకాపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సిపిఎస్ ,జిపిఎస్,యూపిఎస్‌కు వ్యతిరేకంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేస్తామని రద్దు చేయకపోవడంతో పాటు జిపిఎస్‌ను తీసుకురావడం అన్యాయం అన్నారు. రాష్ట్ర పరిశీలకులు రాష్ట్ర కార్యదర్శి సల్మాన్ రాజు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్.ను పునరుద్ధరించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు కె.కె.ఎల్.ఎన్ ధర్మారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు వై .శ్రీనివాసరావు, బి దేముడు బాబు,ఎం.డి.కె జయలక్ష్మి, దొర, పడాల అప్పారావు, ఎన్. సన్యాసినాయుడు, కె.శ్యాం కుమార్,డి.నూకేష్, ఆడిట్ కమిటీ సభ్యులు ఎమ్. రామ్మూర్తి, ఆళ్ల రవికుమార్, వివిధ మండల శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఎపిటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

విశాఖ కలెక్టరేట్ : ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు, జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్‌ల్లో దేనికీ అంగీకరించేది లేదన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకం మాత్రమే కావాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కార్య దర్శులు ఎన్.విజయశ్రీ, ఎస్.పెద్దినాయుడు, బి.ముత్యాల నాయుడు, యు.నీరజ, సిహెచ్.జగదీష్ పాల్గొన్నారు.

ఏళ్లనాటి ఇల్లు కూల్చివేత దుర్మార్గం : సిపిఎం

బాధితురాలితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం పట్టణంలో అక్రమంగా కూల్చిన అనపరెడ్డి వరలక్ష్మి ఇంటిని తక్షణమే పునర్నిర్మించాలని, కూల్చివేతకు కారకులైన పంచాయతీ ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణం నడిబొడ్డున 80 ఏళ్ల నుంచి నివాసముంటూ, అన్ని రకాల హక్కులు, పత్రాలు ఉన్న అన్నపురెడ్డి వరలక్ష్మి (నాగలక్ష్మి) ఇంటిని తెల్లవారు జామున బుల్డోజర్లతో అన్యాయంగా కూల్చివేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బాధిత కుటుంబీకులను సిపిఎం నాయకులు ఆర్ శంకర్రావు, వివి. శ్రీనివాసరావు, ఎస్వీ నాయుడు తదితరులు వెళ్లి పరామర్శించారు. జరిగిన అన్యాయంపై వివరాలు తెలుసుకున్నారు. వారి పోరాటానికి మద్దతు తెలియజేశారు.

ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ చోడవరంలో కూటమి ప్రభుత్వం బుల్డోజర్లతో పేదల ఇల్లును కూల్చివేతకు పాల్పడం విడ్డూరంగా ఉందన్నారు. పంచాయతీ అధికారులు ఒక ప్రైవేటు వ్యక్తికి అనుకూలంగా వ్యవహరించి అనప రెడ్డి వరలక్ష్మి ఇంటిని అధికార మదంతో కూల్చివేతకు పాల్పడ్డారన్నారు.స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం దీనికి బాధ్యత వహించాలని, కూల్చేసిన ఇంటిని వెంటనే పునర్నిర్మించాలని కోరారు. బాధితులకు సిపిఎం అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

వర్షంతో పైర్లకు ఊపిరి

ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో మళ్లీ కదలిక : పలుచోట్ల వరినాట్లు

ప్రజాశక్తి -కె. కోటపాడు: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువుల్లో జలకళ సంతరించుకుని కళకళలాడుతున్నాయి. ఇప్పటికే పల్లపు ప్రాంతాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి . మెట్ట ప్రాంతాల్లో వరి నాట్లు వేయడానికి తాజా వర్షాలు దోహదపడ్డాయి. ఈ ఏడాది ప్రారంభంలో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. అనేకమంది నాట్లు వేయకుండా ఆగిపోయారు. నీటి వసతి ఉన్నచోట్ల, బోర్లు కింద నాట్లు వేశారు. మండలంలోని మేడిచర్ల, రొంగలి నాయుడుపాలెం పంట పొలాలకు రైవాడ రిజర్వాయర్ నీరు రావలసి ఉన్నా ఏనాడు సకాలంలో వచ్చిన పాపాన పోలేదు. చిట్ట చివరి గ్రామాలైన వీటికి కాలువలు ద్వారా నీరు రావాలంటే ముందుగా దేవరాపల్లి మండలంలో ఉన్న పంట పొలాలకు నీరు చేరిన తర్వాతే ఇక్కడికి వస్తుంది. దీంతో అదును దాటి పోతుందని రైతులు ఆవేదన చెందుతుంటారు. ప్రస్తుతం కురిసిన వర్షాలు ఇప్పటికే నాట్లు వేసిన పంట పొలాలకు పుష్కలంగా నీరు అందినట్లయింది. ఈ మండలంలో 2379 హెక్టార్లలో వరి నాట్లు వేయవలసి ఉండగా, ఇప్పటివరకు 2300 హెక్టార్లలో పూర్తయినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. చెరువుల్లో నీరు పుష్కలంగా చేరడంతో ప్రస్తుత ఖరీఫ్ వరి పంటకు ఎటువంటి ఢోకా ఉండదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అధిక వర్షాలు కురిసిన నేపథ్యంలో పైర్లకు చీడపీడలు, తెగుళ్ళు సోకకుండా తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు చెబుతున్నారు.

బుచ్చయ్యపేటలో వరి నారు తీస్తున్న మహిళలు


కె.కోటపాడులో వర్షంతో వరిపైర్లకు ఊపిరి

బుచ్చయ్యపేట : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాల్లో రైతుల వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. భారీ వర్షాలకు పంట పొలాల్లో అధికంగా నీరు చేరింది. మండలంలో గలపాటు గ్రామాల్లో రైతులు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు.కొద్ది రోజులుగా వర్షాలు లేక పూర్తిస్థాయిలో వరి నాటు పడలేదు. భారీ వర్షాలతో పొలాల్లో సాగునీరు చేయడంతో రైతులు ముమ్మరంగా వరినాట్లు పనుల్లో నిమగ్నమయ్యారు.

రేపు ఎఐటియుసి బహిరంగ సభ

ప్రజాశక్తి -అనకాపల్లి : ఈనెల3 వరకు విశాఖ పట్నంలో జరిగే ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని యూనియన్ అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు వై ఎన్ భద్రం పిలుపునిచ్చారు. మామిడిపాలెంలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం మాట్లాడుతూ నిరంతరం కార్మిక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్న ఎఐటియుసి సమావేశాలలో జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అమర్జిత్ కౌర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు జాతీయ ఉపాధ్యక్షులు డి .ఆదినారాయణ తదితరులు పాల్గొంటారన్నారు. 3న విశాఖ సరస్వతి జంక్షన్ నుండి మహ కార్మిక ప్రదర్శన ప్రారంభమై జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ జరుగుతుందని, జయప్రదం చేయాలని భద్రం కోరారు. సమావేశంలో సంఘం అధ్యక్షులు గోపాలం మహాలక్ష్మి నాయుడు, అరిగా అప్పలకొండ, మిర్తిపాటి కాశప్పారావు, పీలా వెంకట్రావు, సిహెచ్ అప్పలనాయుడు, కార్మిక నాయకులు చెల్లూరు నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సస్యరక్షణ

రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా ఉద్యానవన అధికారి

ప్రజాశక్తి- కె.కోటపాడు : వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో ఉద్యానవన పంటలకు తెగుళ తెగుళ్లు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు రైతులకు తెలిపారు. ఆదివారం మండలంలోని కే సంతపాలెం, సూది వలస, పాత వలస గ్రామాల్లో ఉద్యానవన పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కూరగాయ పంటల్లో నిలువ ఉన్న నీటిని బయటకు పంపాలని, వ్యాధికారక శిలీంద్రాలను, చీడపీడలను నివారించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కూరగాయ పంటలపై ఆకుమచ్చ, కాయ కుళ్ళు, బూజు తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా లీటర్ నీటికి 2.5 గ్రాములు సాఫ్ మందును కలిపి రెండుసార్లు పిచికారి చేయాలని అన్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వర్షాలతో జిల్లాలో ఎక్కడా ఉద్యాన పంటలకు నష్టం జరగలేదన్నారు. కూరగాయల విత్తనాలు, పండ్ల మొక్కలు సబ్సిడీపై అందిస్తామన్నారు. పందిరి జాతి కూరగాయ మొక్కలకు పందిరి వేయటానికి సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. కె.సంతపాలెం సర్పంచ్ చల్లమంగ, ఎఫ్‌పిఓ సభ్యులు ప్రభాకర్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

100 మందికి ఉచిత కంటిపరీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో మాజీ ఎంపిటిసి సభ్యులు సిరసపల్లి సన్యాసిరావు ఆధ్వర్యంలో ఆదివారంఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 84వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి మాదంశెట్టి నీలాబాబు శిబిరాన్ని ప్రారంభించారు 100 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 25 మందికి కంటి ఆపరేషన్ ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఇతరత్రా కంటి వ్యాధులకు పలువురిని ఎంపిక చేసి, వారికి మెరుగైన వైద్యసేవలను శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్యులతో చికిత్సకు రిఫర్ చేశారు.కార్యక్రమంలో చూచుకొండ రమణ, సీతారామ మహిళా మండలి చైర్మన్ గవర సురేష్ సిరసపల్లి రమన, శంకర్ ఫౌండేషన్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ అలేఖ్య, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ సిహెచ్ అశ్వనీకుమార్, నర్సింగ్ స్టాఫ్ లావణ్య పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న టిడిపి నేత నీలాబాబు

క్వారీ వాహనాలతో...

రాజుపేట రహదారి ఛిద్రం

-అవస్థలు పడుతున్న వాహనదారులు-చోద్యం చూస్తున్న అధికారులు

క్వారీ ధాటికి దెబ్బతిన్న పశువుల పాక

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో రాజుపేట రహదారి ధ్వంసం అనేకంటే విధ్వంసం అనే అనాలి ఎందుకంటే ఇక్కడ సమీపంలో నల్ల పిక్క క్వారీ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా లారీలతో రాత్రి పగలు అని తేడా లేకుండా పరిమితికి మించి అధిక లోడుతో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతూ ఉండడంతో రహదారిని వి ధ్వంసం చేశారనే చెప్పాలి. దీంతో ప్రజలు రైతులు వాహనదారులు, విద్యార్థులు, పాదచారులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పూర్తిగా ఛిద్రం కావడంతో క్వారీ నిర్వాహకుడు క్వారీ రబ్బిష్ గుట్టల గుట్టలుగా రోడ్లపై పోసి వదిలి వేయడంతో వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. గోతుల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వర్షం వస్తే గోతుల కారణంగా కనీసం పాదచారులు నడిచేందుకు కూడా అవస్థలు పడుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఇక్కడ తిరుగుతున్న లారీలకు పూర్తిస్థాయిలో పర్మిట్ సహా రవాణా టాక్స్ చెల్లించకపోవడంతో పాటు కాలం తీరిన వాహనాలు నడిపినా వాటిపై అధికారులు చర్యలు తీసుకునేందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాలం తీరిన వాహనాలు నడుపుతున్నా రవాణా శాఖ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అడపా దడప రవాణా శాఖ అధికారులు తూతూ మంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టక పోవడంతో ఇష్టారాజ్యంగా కాలం చెల్లిన వాహనాలు రాత్రి సమయంలో నడుపుతున్నారు.

కోటవురట్ల గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 69లో 7.78 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న క్వారీ 2010లో ఎపెక్స్ ఎన్కాన్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ లిమిటెడ్ వారికి పరిమితులతో కూడిన లీజుకు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు భారీ డిటోనేటర్లు ఏర్పాటు చేసి బ్లాస్టింగ్ జరుపుతూ పెద్ద ఎత్తున కంకర రవాణా చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో బ్లాస్టింగ్

ఛిద్రమైన రహదారి

కారణంగా ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. సమీపంలోని పశువుల పాకలు దెబ్బతింటున్నాయి. సమీపప్రాంత రైతులు బోరు బావులు సక్రమంగా పనిచేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారికి ఆనుకొని గుట్టువాడ రెవెన్యూ పరిధిలో ఉన్న క్రషర్ కారణంగా విపరీతమైన కాలుష్యం ఏర్పడుతుంది. క్రషర్ నుంచి పంచాయతీకి చెల్లించవలసిన పన్నులు సైతం సక్రమంగా చెల్లించకపోవడం విశేషం. సమీపంలో పంట పొలాలకు క్రషర్ కారణంగా సరైన దిగుబడి లభించక రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారిని అనుకోని ఉండడంతో ప్రయాణికులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్రషర్ నుంచి వస్తున్న దుమ్ము ధూళి కారణంగా గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా గడిచిన దశాబ్ద కాలంగా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడం పట్ల అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కూటమి స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నీటిని విడుదల చేస్తున్న డిఇ

తాండవ నీరు విడుదల

ప్రజాశక్తి-నాతవరం: మండలంలో తాండవ జలాశయం నీటిని డిఈ అనురాధ సిల్వర్ గేట్ల ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ, నదిని ఆనుకుని ఉన్న ఆడాకుల, చమ్మచింత గుమ్మిడికొండ తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.2400 క్యూసెక్కుల నీరు విడుదల చేసామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ సోమినాయుడు, ఏఇ.లు రామకృష్ణ, శ్యామ్ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని గుండుపాల గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్స్ డే సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మర్రి బాబులు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ, రైతులు వ్యవసాయానికి పెట్టుబడులు పెట్టలేక నష్టాల పాలవుతున్నారన్నారు. గత జగన్ ప్రభుత్వం పట్టా పాస్ పుస్తకాలపై బొమ్మల పేర్లుతో గారిడిలు, రకరకాల పథకాల పేర్లతో రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టడంతో గద్దె దింపారని ఎద్దేవా చేశారు. నూతన ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జి.గురుబాబు, సింగంపల్లి రాజబాబు, మర్రి రాములు, నంబారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిపి టీం సంబరాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు తొలిసారి ప్రమాణ స్వీకారం చేసి ఆదివారంతో 30 ఏళ్లు గడుస్తుండడంతో ఐటీడీపీ టీమ్ సంబరాలు చేసుకున్నారు. నక్కపల్లిలో హోం మంత్రి వంగలపూడి అనిత స్వగృహమునందు ఐటీడీపీ టీమ్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఐటిడిపి అధ్యక్షులు భీమరశెట్టి శ్రీనివాస్, రమేష్, సతీష్, వంశి, దమ్ము రాజు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న బృందం ప్రతినిధులు

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని లింగాపురం, తంగేడు గ్రామంలో నాకో నేతృత్వంలో మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు ప్రివెన్షన్ కంట్రోల్ యాక్ట్ నిర్వాహకులు తెలిపారు. ఎయిడ్స్ పై అవగాహన కల్పించి ఎక్కువ మందికి పరీక్షలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో స్థానిక హెల్త్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా

పలు సేవా కార్యక్రమాలు

రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి- సీతమ్మధార : జనసేన జిల్లా పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. వందలాది మంది కార్యకర్తలు నికి మెగా స్పందన లభించింది. సుమారు వందలామందికి పైగా జనసైన కార్యకర్తలు రక్తదానం చేశారు. ముందుగా వంశీకృష్ణ కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాసేవే పవన్ కల్యాణ్ ప్రథమ లక్ష్యమని చెప్పారు. ఎన్టీఆర్, రెడ్‌క్రాస్, కెజిహెచ్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో శిబిరం నిర్వహించారు.

ములగాడ : జీవిఎంసి 61వ వార్డు పరిధి హరిజన వీధి మండపంలో లయన్స్ బ్లడ్ బ్యాంకు క్లబ్ ఆధ్వర్యాన డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా పశ్చిమం నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మనిషికి రక్తం ఎంతో అవసరమని, యువత ఎప్పటికప్పుడు రక్తదాన శిబిరాలను ఏర్పాటుచేయడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భాన్ని పురస్కరించుకొని జివిఎంసి 91వ వార్డు పాత గోపాలపట్నంలో జనసేన వార్డు అధ్యక్షుడు నరేంద్ర ఆధ్వర్యాన ఆదివారం సీతారామ అభయాంజనేయ గ్రామ సేవా సంఘం కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బోడ్డపాలెం గ్రామంలో మండల ఉపాధ్యక్షులు బాలు, సర్దార్ రెడ్డి ఆధ్వర్యాన 40 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి జనసేన ఇంచార్జ్ సందీప్ పాల్గొని రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాఖరి శ్రీనుబాబు, తమ్మిన అప్పలరాజు, బాలు, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్లీన్ ఆంధ్ర గ్రీన్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ని సందర్శించి ఒక గుండె వ్యాధిగ్రస్తుడితో మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నేతలు బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, కర్రి కనకరాజు గండి దుర్గాప్రసాద్, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, బర్నికాన సాయినాదరావు,బర్ల రమణ, పోతల కనకరాజు, సబ్బవరపు సత్యనారాయణ,కిల్లి వెంకటసత్యనారాయణ, కర్రి నర్సింగరావు, టి శేఖర్, బంతి కోళ్ల పద్మ ,పెద్దాడ రమణమ్మ, బలిరెడ్డి నాగమణి, ఎంపిడిఒ రమేష్ నాయుడు, ఎపిఒ ఎం. శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ:ఈ నెల 2వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని గొలుగొండ మండలం ఏఎల్ పురం హైస్కూల్లో క్లీన్ ఆంధ్ర గ్రీన్ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పిచ్చి తుప్పలను తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు. జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్ చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, నాయకులు రేగుబళ్ల శివ, మండల అధ్యక్షులు గండెం దొరబాబు, సలాదుల ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:పవన్ కళ్యాణ్ జన్మదినంను పురస్కరించుకొని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్ చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో నాతవరం మండల విద్యాశాఖ కార్యాలయంలో మొక్కలు నాటారు.నాయకులు బద్రి, చినరాజు, మాకిరెడ్డి వెంకటరమణ, పోలుపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ:పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా చీడికాడ సెంటర్‌లో జరిగే రక్తదాన శిబిరంలో జనసేన యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు జి వి మూర్తి కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మధ్యాహ్నం 12గంటలనుండి ఆంధ్రుల అన్నపూర్ణమ్మ శ్రీ డొక్కా సీతమ్మ పేరు మీదుగా అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

రోలుగుంట:మండలంలోని బుచ్చింపేట గ్రామ పంచాయతీలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని టిడిపి సీనియర్ నాయకులు ఉబాల పోతురాజు నాయుడు, జన సైనికులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

నూకాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: మండలంలో కెపి అగ్రహారంలో నూకాలమ్మ అమ్మవారిని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తదితరులు ఆదివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు, మండల పార్టీ అధ్యక్షులు గోకాడ కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఎంవివి సత్యనారాయణ, . డొంకిన అప్పలనాయుడు, సుంకర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న నాయకులు

ఎస్ఐకి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రామారావును మండల నసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్సైను కలిసిన వారిలో గొలుగొండ మండల అధ్యక్షులు గండం దొరబాబు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, నియోజకవర్గ ఎస్సీ ఎస్టీ అధ్యక్షులు డాక్టర్ కోన నారాయణరావు, ప్రధాన కార్యదర్శి సల్లాదుల ప్రసాద్, రామకృష్ణ, వెంకటేష్, లోవ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎంపీ సిఎం రమేష్ కుట్రలను తిప్పికొట్టాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : రైతులను, ప్రజలను మోసం చేసేందుకు అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ ప్రయత్నిస్తున్నారని, అతని కుట్రలను అందరూ తిప్పికొట్టాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గోవాడ సహకార చక్కెర ఫ్యాక్టరీని ఆధునికీకరించి, క్రషింగ్ సామర్థ్యాన్ని పెంచి మద్దతు ధర, ప్రోత్సాహక ధర పెంచి రైతులను ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం గతంలో తెలియజేసిందని గుర్తుచేశారు. కానీ నేడు ఇథనాల్ తయారీ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే కుట్రలకు తెగబడుతోందని, రైతాంగం ఆ కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. ఇథనాల్ తయారీపై మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలతో సమావేశమై నిర్ణయం తీసుకుంటామని ఎంపీ సిఎం.రమేష్ ప్రకటించడంపై సిపిఎం అభ్యంతరం తెలియజేస్తోందన్నారు. ఇలా ప్రజా ప్రతినిధులతో నిర్ణయం తీసుకుంటామనడం రైతులను మోసం చేయడమే అవుతుందని తెలిపారు. ఫ్యాక్టరీ మనుగడను దెబ్బతియ్యాలని చూస్తే రైతులను సమీకరించి పోరాటాలతో అడ్డుకుంటామని లోకనాథం హెచ్చరించారు. క్రషింగ్ నిలిపివేసిన ఏటికొప్పాక, తుమ్మపాల, తాండవ సుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరణ విషయం మాట్లాడకుండా క్రషింగ్ జరుగుతున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ తయారీ అంశాన్ని తీసుకొచ్చి రైతులు, ప్రజల దృష్టిని మళ్లించాలనే ప్రయత్నాలను విరమించుకోవాలని హితవు పలికారు. రైతుల కష్ట సుఖాలు, వారి వాస్తవ బాధలు తెలియని సిఎం.రమేష్ ఇథనాల్ తయారీపై ప్రభుత్వం ఇచ్చే భారీ సబ్సిడీని ఉపయోగించుకొని తన చేతుల్లోకి పరిశ్రమ ఆస్తులను తీసుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోందన్నారు. ఆయన ప్రయోజనాలకు స్థానిక ఎమ్మెల్యేలు రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టొద్దని తెలిపారు. రైతులు, జిల్లా ప్రజల ప్రయోజనాలను దెబ్బతియ్యాలని చూస్తే అడుగడుగునా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఎస్ఇజెడ్‌ల పేర్లతో మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లో పంట భూములను సేకరించే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. జిల్లా ప్రజలపై ఏమాత్రం చిత్తశుద్ధి వున్నా పరవాడ, అచ్యుతాపురం సెజ్‌ల్లోని ఖాళీ స్థలాల్లో పరిశ్రమలు రాబట్టడానికి ప్రయత్నించి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇప్పటికే ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు, నిర్వాసితులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలన్న జిఓను అమలు చేయడంలేదుగానీ ఇప్పుడు కొత్తగా సెజ్‌లు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తామని కళ్లబొల్లి కబుర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఆ మాటలను ఎవరూ నమ్మవద్దని తెలిపారు. సిఎం.రమేష్ మాటల్లోని కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

రైతులను నట్టేట ముంచొద్దు

చోడవరం : కొత్త పరిశ్రమలు తీసుకు వస్తామని నమ్మబలికి రైతులను నట్టేటముంచే ఎస్ఇజెడ్‌లను తీసుకురావడం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న అన్నారు. రైతుల పంట పొలాలను నాశనం చేయాలని చూడటం దారుణమన్నారు. రైతులను, ప్రజలను మోసం చేయాలని చూస్తున్న ఎంపీ సిఎం.రమేష్ కుట్రలను చోడవరం, వి.మాడుగుల రైతులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

కార్యాలయంలోకి చేరిన వర్షపు నీరు

వర్షానికి కారుతున్న..
తహశీల్దార్ కార్యాలయం
-అవస్థలు పడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలం తహసిల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో మండల అధికారులు, సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కార్యాలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో వర్షపు నీరు కారిపోవడంతో సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

కార్యాలయానికి సరైన వైరింగ్ లేక పోవడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.కార్యాలయం నిర్మాణం చేపట్టి దాదాపుగా 50 సంవత్సరాలు పూర్తి కావస్తుంది. నాడు ఏర్పాటు చేసిన విద్యుత్ వైరింగ్‌తోనే ప్రస్తుతం కార్యాలయం నడుస్తోంది. వైర్లు ఎక్కడపడితే అక్కడ చిందరవంతంగా పడి ఉండడంతో విలువైన దస్త్రాలు షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. రికార్డు రూముకు సైతం సరైన భద్రత లేకపోవడంతో రికార్డులు తడిచిపోతున్నాయి. దాదాపు కార్యాలయం అంతా వర్షపు నీరు చిమ్మి తడిచి ముద్దయినట్లు కనిపిస్తుంది.

అత్యవసర పరిస్థితుల్లో వాడుకునేందుకు ఇన్వర్టర్ కూడా లేకపోవడం విశేషం. కరెంటు లేని సమయంలో సిబ్బందికి పనులకు ఆటంకం కలుగుతుంది. కూటమి నాయకులు ఇప్పటికైనా స్పందించి నూతన భవన నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



చిందర వందరగా ఉన్న విద్యుత్తు వైర్లు

రోగులతో నిండి ఉన్న మంచాలు

సిహెచ్‌సికి రోగుల తాకిడి

ప్రజాశక్తి కోటవురట్ల:మండల కేంద్రంలో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రానికి గడిచిన పక్షం రోజులుగా రోగులు తాకిడి ఎక్కువగా ఉంది. సీజనల్ వ్యాధుల కారణంగా సుమారు ప్రతిరోజు 350 మంది వరకు ఓపి ఔట్ పేషెంట్, 50 మంది వరకు ఇన్ పేషెంట్ కు సేవలు అందిస్తున్నట్లు ఆరోగ్య కేంద్ర సూపరిండెండెంట్ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.ఈ ఆరోగ్య కేంద్రానికి ముగ్గురు డాక్టర్ల కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, సహా ఆర్థో వైద్యులు లేకపోవడంతో ఆయా సేవలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. రోగులకు అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఆరోగ్య కేంద్రాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు, రోగులకు అందించే ఆహారం పరిశుభ్రంగా ఉండేందుకు ఆరోగ్య కేంద్రం వద్ద తయారు చేయిస్తున్నట్లు తెలిపారు.

సినీ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తెలుగు సినీ పరిశ్రమను విశాఖకు తీసుకు వచ్చి, 24 క్రాఫ్ట్స్ కార్మికులకు పూర్తి స్థాయిలో జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ కంచర్ల అచ్యుతరావు తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన కార్యక్రమంలో ఆయన ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినా ఇంకా తెలుగు పరిశ్రమ తెలంగాణకే పరిమితమైపోయిందన్నారు. ఫలితంగా ఇక్కడి సినీ పరిశ్రమ ద్వారా వచ్చే ఆదాయం మొత్తం తెలంగాణకు వెళ్లిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖలోనే ఫిల్మ్ ఛాంబర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సెన్సార్ బోర్డును కూడా ఇక్కడే నెలకొల్పాలని సూచించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలు సినిమా షూటింగులకు అనుకూలమైన పర్యాటక ప్రదేశాలని తెలిపారు. సినీ కళాకారులు, కార్మికుల కోసం ప్రభుత్వం తక్షణమే ఒక ప్రత్యేక కార్యాలయం, వెబ్‌సైట్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం అచ్యుతరావును కళాకారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు తోరం రాజా, ప్రధాన కార్యదర్శి అచ్యుత రామస్వామి, తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక, జానపద కళారూపాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. కె.రాజేంద్రప్రసాద్, లక్ష్మి స్వరూప వ్యాఖ్యానం చేశారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న అచ్యుతరావు

కథలు చెబుతున్న గ్రంథాలయాధికారి

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పి.దమయంతి పిల్లల చేత నీతి కథలు చదివించి నీతిని వివరించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ ఉపాధ్యాయుల దినోత్సవ ప్రాముఖ్యత వివరించారు. సమాజానికి సేవ చేసిన ప్రముఖుల గురించి విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులతో పజిల్ గేమ్ ఆడించారు.

వేట నిషేధ భృతి చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి -నక్కపల్లి:మత్స్యకారులకు వేట నిషేధ భృతి ని వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో ఆదివారం సిపిఎం గ్రామ కార్యదర్శి ఎ. మహేష్ బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత వైయస్సార్‌సిపి ప్రభుత్వం మత్స్యకారుల భరోసా సంవత్సరానికి 10 వేల రూపాయలు ఇచ్చేదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం 20 వేల రూపాయలు చెల్లిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర నెలలు అవుతున్నా నేటికీ మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.మత్స్యకారులకు వేట సాగితే గాని పూట గడవని పరిస్థితి ఉందన్నారు.ఇప్పటివరకు ప్రభుత్వం వేట నిషేధ పరిహారం చెల్లించక పోవడంతో మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. మత్స్యకారుల ఆర్థిక పరిస్థితిని, పేదరికాన్ని అర్థం చేసుకుని వెంటనే నిధులు విడుదల చేసి పరిహారం 20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు కె.కాశీరావు, ఎం.భయ్యన్న, సిహెచ్ సోమేష్, బి.నూకరాజు, జీ.కాశీరావు, కె.భూలోక, పి.రమణ, బి.అప్పలరాజు, ఎం.జాన్, జీ.అంజి, సిహెచ్ తాతాజీ, పి.కాశీ, పి.కోటి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు

కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసిల్దార్

పందూరులో తహశీల్దార్ పర్యటన

ప్రజాశక్తి -కోటవురట్ల:పందూరు వద్ద కొండ చరియలు విరిగిపడి దెబ్బ తిన్న ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను తహసిల్దార్ జానకమ్మ ఆదివారం పరిశీలించారు. ఇల్లు దెబ్బతిన్న మామిడి లక్ష్మి ఇంటిని పరిశీలించడంతో పాటు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె కొండ సమీపంలో నివాసం ఉంటున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల కుటుంబానికి నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి ఆషా, జనసేన పార్టీ స్థానిక నాయకులు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.